నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె చాంబర్లో నగరపాలక సంస్థ అధికారులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్లలో స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అందరి సహకారంతో నగరాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజలకు మంచి పాలన అందించి అందరి మన్ననలను పొందాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

భయమేస్తోంది.. అమ్మా..!

: చిన్నారుల జీవితాలతో కామాంధుల ఆటలు

: కఠిన శిక్షలు వేసినా సమాజంలో కానరాని మార్పు

: చిన్నారుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు

విశాలాంధ్ర-విజయనగరం: అభం శుభం తెలియని చిన్నారుల జీవితాలకు భద్రత లేకుండా పోతోంది. చిన్న పిల్లలను చూస్తే ఎవరికైనా ముద్దాడాలని పిస్తుంది. కానీ కొందరు దుర్మార్గులు వారి జీవితాలతో ఆటలాడు కుంటున్నారు. ఎవరి చేతినైనా ఆసరాగా పట్టుకుని నడిచే ఈ చిన్నారులకు ఆ చేయి తమ అండగా ఉంటుందని భావిస్తున్నారు తప్ప తమను కబళిస్తుందని గ్రహించలేని వయస్సు వారిది. గంట్యాడ మండలంలో శుభకార్యానికి వెళ్ళిన ఓ దంపతులు తమ చిన్నారిని వెంటబెట్టుకుని వెళ్లారు. తీరా అక్కడ ఓ కామాంధుడు ఆ చిన్నారిపై లైంగికదాడి చేసాడు. పట్టుమని పదేళ్ళుకూడా లేని ఈ చిన్నారికి తనపై అఘాయిత్యం జరిగిందని తెలియని పరిస్థితి. ఇక విజయనగరం పట్టణ పరిదిలో ఓ చిన్నారిని 56 ఏళ్ళ వృద్దుడైన రిక్షావాడు అఘాయిత్యం చేయడానికి సాహసించాడు. ఇవి కేవలం కొన్ని సంఘటనలు మాత్రమే వెలుగులోకి రాని సంఘటనలు కోకొల్లలు.

పోలీసులు చర్యలు తీసుకుంటున్నా..

జిల్లాలో ఇటీవల కాలంలో ఫోక్సో కేసులు నమోదు కావడంతోపాటు కొద్ది రోజులలోనే నిందితులకు శిక్ష పడేలా చేస్తున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందా ల్ చిన్నారుల లైంగిక దాడుల కేసులపై ప్రత్యేక దృష్టిసారించి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తున్నారు. జీవితాంతం నిందితులు జైలులోనే ఉండేలా శిక్షలు వేయిస్తున్నారు. అయినా సమాజంలో మార్పు అనేది రావడం లేదని ప్రజలలో ఆవేదన నెలకొంది. మరోవైపు పోలీసుల శాఖ పాఠశాలల్లో సైతం గుడ్‌టచ్, బేడ్‌టచ్ అనే అంశంపై అవగాహన కల్పిస్తోంది. ఎన్నిరకాలుగా అవగాహన కల్పించాలో అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నారు.

భయాందోళనలో తల్లిదండ్రులు..

నేడు కార్పోరేట్ విద్య మోజులో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటోలలోనూ, రిక్షాలలోనూ, అవసరమైతే పాఠశాల బస్సులలోనూ పాఠశాలలకు పంపిస్తున్నారు. మార్గమధ్యలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోవడం గానీ, వారితో ప్రేమగా మాట్లాడడం గానీ ప్రస్తుతం కాలంలో తక్కువగా ఉంది. పాఠశాలలలో ఇచ్చిన హోంవర్కును అడుగుతున్నారు. తప్ప మీరు వచ్చే దారిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనేది పట్టించుకోవడం లేదు. పిల్లల్ని తీసుకువెళ్తున్న వారు తాగుబోతులా, తిరుగుబోతులా అనేది కూడా ప్రస్తుతం పరిశీలన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండేళ్ళగా తమ చిన్నారిని పాఠశాలకు తీసుకువెళ్ళే ఓ వృద్దుడైన రిక్షా పుల్లర్ తమ చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడతారంటే ఎవరూ నమ్మరు. ఇటువంటి సంఘటనలు జరిగిన తరువాత కాకుండా ముందుగా తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లా పోలీసుశాఖలో పారదర్శకంగా బదిలీలు

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో వివిధ హెరీదాల్లో పని చేస్తూ, ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ నవంబరు 21న జిల్లా పోలీసు కార్యాలయంలో కౌన్సిలింగు నిర్వహించి, పారదర్శకంగా బదిలీలు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ-బదిలీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు కౌన్సిలింగు నిర్వహించినట్లుగా తెలిపారు. కౌన్సిలింగుకు వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తూ, ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన పోలీసు సిబ్బందిని కౌన్సిలింగు ప్రక్రియ ద్వారా బదిలీలు చేసేందుకుగాను జిల్లా పోలీసు కార్యాలయంకు పిలిపించామన్నారు. బదిలీల కౌన్సిలింగుకు హాజరైన పోలీసు సిబ్బంది పుట్టిన తేదీ, సీనియారిటీ ప్రాతిపదికగా ఒకలిస్టును తయారుచేసి, పోలీసు కార్యాలయంలో కంప్యూటరు స్క్రీన్ మీద ప్రదర్శించామన్నారు. బదిలీల కౌన్సిలింగుకు హాజరైన వారిని సమావేశ మందిరంలో కూర్చుండబెట్టి, ఒక్కొక్కరిగా ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళను కౌన్సిలింగుకు పిలిచామన్నారు. వివిధ పోలీసు స్టేషన్లలో ఏర్పడిన ఖాళీలను కంప్యూటరు స్క్రీన్ మీద ప్రదర్శించి, వారి నుండి విన్నపాలను స్వీకరించి, వారు కోరుకున్న స్థానానికి పారదర్శకంగా బదిలీలను చేపట్టామని జిల్లా ఎస్పీ అన్నారు. 17మంది ఎఎస్ఐలు, 59 హెడ్ కానిస్టేబుళ్ళు, 137మంది కానిస్టేబుళ్ళకు జిల్లా ఎస్పీ వివిధ పోలీసు స్టేషన్లుకు బదిలీలు చేస్తూ, ఉత్తర్వులు జారీ చేసారు. ఎటువంటి సిఫార్సులకు తావు లేకుండా క్రింది స్థాయి సిబ్బంది కోరుకున్న స్థానానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ బదిలీలు చేపట్టడంతో పోలీసు సిబ్బంది తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఈ బదిలీల ప్రక్రియలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఓ పి.శ్రీనివాసరావు, ఆఫీసు పర్యవేక్షకులు వెంకటలక్ష్మి, ఎస్పీ సిబిలు ఎవి లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, చాముండేశ్వరి, ఇతర పోలీసు అధికారులు, కంప్యూటరు సిబ్బంది పాల్గొన్నారు.

నవదుర్గ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం

విశాలాంధ్ర-రాజాం : రాజాం నవదుర్గ ఆలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సూర్య దుర్గ కళ్యాణ మండపంలో భారీ అన్నదానం జరిగింది. అనువంశిక ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, కమిటీ సభ్యులు దాసరి అప్పారావు, కూరాడ వెంకటరావు, శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మానవత సంస్థ ఛైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, సభ్యులు పెంకి చైతన్యకుమార్,ఉల్లాకుల నీలకంతేశ్వర యాదవ్, ఈవో శ్యామలరావు, తదితరులు పాల్గొన్నారు. ప్రతీ ఏటా భవానీ భక్తుల ఇరుముడి బియ్యంతోపాటు దాతలు ఇచ్చిన సహకారంతో అన్నదానం నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

నామ మంత్రంగా రీసర్వే, గ్రామసభలు..!

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో అవకతవకలు ఉంటే తెలపాలంటూ గ్రామాల్లో పెడుతున్న రిసర్వేలు తూతూ మంత్రంగానే సాగుతున్నాయి. గురువారం మండలంలోని ధర్మవరం గ్రామంలో జరిగిన రీసర్వే గ్రామసభ నిర్వహిస్తున్నామని గ్రామ ప్రజలఎవరికి తెలియపరచలేదని రీ సర్వే లో బయటపడ్డ తప్పులు ఏమిటో ప్రజలకు తెలియకుండానే రీ సర్వే పై సందేహాలు, తప్పులు, సలహాలు ఉంటే ఇవ్వాలని గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలు తూతూ మంత్రంగా సాగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రీ సర్వే జరిగిన లోపాల గురించి ప్రజలకు తెలియపరచకుండా సందేహాలు ఏవైనా ఉంటే తెలపాలని గ్రామ ప్రజలకు తెలియకుండా గ్రామసభ నిర్వహిస్తున్నారని మండలంలోని తిమిడి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు ఆరోపించారు. రీ సర్వే మాటున లొసుగులను అడ్డుపెట్టుకొని రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయమే జిల్లా అధికారులు స్పందించి ప్రజలకు స్పష్టమైన ఆదేశాలి ఇచ్చి గ్రామ సభ నిర్వహించి సందేహాలను నివృత్తి చేయాలని సన్యాస నాయుడు కోరారు.

రసాయన శాస్త్ర అభివృద్ధి సమాజ అభివృద్ధికి మూలస్తంభం

రసాయన శాస్త్ర పురోగతిపై వర్క్‌షాప్‌లో వక్తలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలోరసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ అవుట్‌రీచ్ ప్రోగ్రాంను "రసాయన శాస్త్రాలలో అభివృద్ధి" అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. నవంబర్ 23 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో తాజా రసాయన శాస్త్ర పరిశోధనలు, విద్యా సహకారం, విద్యార్థుల పరిశోధనా సామర్థ్యాల అభివృద్ధి వంటి ముఖ్య అంశాలపై లెక్చర్స్ ఉంటాయి. యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభోత్సవ సమావేశంలో జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ ప్రధాన సంపాదకులు ప్రొఫెసర్ ఎస్. నటరాజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో తాజా పురోగతుల ప్రాధాన్యతను వివరించారు. "రసాయన శాస్త్ర అభివృద్ధి సమాజ అభివృద్ధికి మూలస్తంభం" అని పేర్కొన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.వి. కట్టిమని అధ్యక్షత వహించి, విద్యా రంగంలో ఉన్నతమైన లక్ష్యాలను సాధించడంలో విశ్వవిద్యాలయ పాత్రపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు డా. సురేష్ బాబు కె, ప్రొఫెసర్ ఎం. శరత్‌చంద్ర బాబు, డా. కిశోర్ పడాల నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో పరిశోధనా ఆవేశం పెంపొందించడంతోపాటు, విద్యా మేధస్సుకు కొత్త మార్గాలను సృష్టించేందుకు తోడ్పడుతుందని నిర్వాహకులు తెలిపారు. గిరిజన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: శ్రీ విశ్వనాథ గురుస్వామి వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరై ముందుగా విశ్వనాథ గురుస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వనాథ్ గురుస్వామి వర్ధంతి సందర్భంగా పట్టణంలో పలువురు పేద ప్రజలకు మాజీ ఎమ్మెల్యే శంబంగి చేతులమీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు.

అపార్ ఐడి నమోదు కేంద్రాలను పరిశీలన

ఎంఈఓ బాల భాస్కరరావు

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రమైన వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎర్పాటు చేసిన విద్యార్థుల ఆధార్ అపార్ ఐడి నమోదు కేంద్రంలను మండల విద్యాశాఖాధికారి పి.బాల భాస్కరరావు గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్య వ్యవస్థలో చేపట్టిన ఆపార్ ఐడి నమోదును పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్‌లో పేరు, పుట్టిన తేది మార్పులు,చేర్పులు గూర్చి డిజిటల్ అసిస్టెంట్ కు సూచనలు సలహాలు అందించారు.ఈ ఆధార్ అపార్ ఐడి నమోదు పాఠ శాలలో రెండు రోజులు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

పార్కులు, డివైడర్ల పరిశుభ్రత

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు నగరంలో ప్రధాన పార్కులు, డివైడర్ల పరిశుభ్రత కార్యక్రమాన్ని సిబ్బంది చేపట్టారు. రింగ్ రోడ్ లోఉన్న డివైడర్ల మధ్య భాగంలో చెత్తాచెదారాలు పెరిగిపోవడంతో వాటిని వెంటనే ప్రక్షాళన చేస్తున్నారు. చెట్ల చుట్టూ పాదేలను తవ్వి ఏపుగా పెరిగేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే రాక్ గార్డెన్ లో ఎండిపోయిన మొక్కలను తొలగించి వేస్తున్నారు. మహిళా పార్కులో గడ్డి మొక్కలను తొలగించి వేస్తున్నారు. అచంట గార్డెను శుభ్రపరచి నీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. గాంధీ పార్కులో పరిసరాలను పరిశుభ్రపరుస్తున్నారు.

సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ కు అంతరాయం

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న అచ్యుతాపురం ఫీడర్ లైన్ కింద ఉన్న చెట్టుకొమ్మలు తొలగించడం ఏమైనా సాంకేతిక సమస్యలు ఉన్నట్లయితే వాటిని సరిచేయడం జరుగుతుంది. కావున పై గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడును గోషాడ, గుజ్జంగివలస, చుక్క పేట, కెల్ల చోడవరం, అచ్చుతాపురం, తెట్టంగి, పోలయ్యవలస, తాత వారి కిట్టలి, పెనుబర్తి, చింతపల్లి పేట, గంగిరెల్లి పేట గ్రామాలకు విద్యుత్కు అంతరాయము ఏర్పడునని విజయనగరం టౌన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. త్రినాధ రావు తెలిపారు.

నేడు మండలంలో విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-పూసపాటిరేగ: శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు గోవిందపురం లంకలపల్లి పాలెం, భరణి కాం, తోత్తడాం, గుంపాం గులివిందల పేట, కందివలస, నక్కన్న పేట, వెంపడం, తాళ్ల పేట, కుమిలి కోళ్ల ఫారాలు, పూసపాటి రేగ, పూసపాటిపాలెం, పేరాపురం, పతివాడ ,చిన్న పతివాడ, బర్రిపేట, కొల్లయవలస విద్యుత్ అంతరాయం ఉంటుందని స్థానిక అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి: 104 సిబ్బంది వినతి

విశాలాంధ్ర-చీపురుపల్లి: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చీపురుపల్లి జి బొండపల్లి 104 సిబ్బంది చీపురుపల్లి మండలం జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష కు సిబ్బంది వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమకి నెలనెలా సక్రమంగా జీతాలు చెల్లించక కుటుంబాలను పోషించటం చాలా కష్టం అవుతుందని జడ్పిటిసి వద్ద వాపో యారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం 50 వేల ఖర్చుతో నిర్వహించి ప్రజాధనవం వృధాకాకుండా చూడాలని 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ మరియు డి.ఈ.ఓ కు జి.ఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి. యఫ్ తిరిగి చెల్లించాలి అని 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలి అని డి. యస్సి ద్వారా నియమితులు అయిన సీనియర్ డ్రైవర్ లను కాంట్రాక్టు లో పెట్టాలి అని ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలి అని ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యో గులకు న్యాయం చెయ్యాలని తెలిపారు. జడ్పీటీసీ మాట్లాడుతూ మీ సమస్యలు పరిష్కారంలో తమ వంతు సహాయ సహకారం ఎప్పుడూ ఉంటుందని సిబ్బందికి భరోసా ఇచ్చారు పై అధికారులకు నాయకులకు విషయం తెలియజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు డ్రైవర్ రామరాజు, డీఈఓ హేమలత, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

పెదతాడివాడ లో సీసీ కెమెరా ఏర్పాటు

గ్రామాల్లో నిరంతర నిఘా

విశాలాంధ్ర-డెంకాడ: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో డెంకాడ మండలంలో భోగాపురం రూరల్ రామకృష్ణ సూచనలు అనుసరించి డెంకాడ ఎస్సై సన్యాసినాయుడు డెంకాడ మండలంలోని వివిధ నేరాలు గుర్తించడంలో భాగంగా పెద్ద తాడివాడ గ్రామంలో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు నేర నియంత్రణకు నేరాలు గుర్తింపునకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని ఎస్ఐ అభిప్రాయం వ్యక్తం చేశారు గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు లో సకాలంలో నేరాలను గుర్తించడానికి వీలవుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో చిరంజీవి రాజు రామ్మూర్తి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతం గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాల గ్రంధాలయంలో పుస్తకపఠనం మరియు జీవితకాల అభ్యాసం ప్రాముఖ్యతను గొప్ప పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో ఇంజనీరింగ్, కంపిటేటివ్, గేట్, సాహిత్యం ప్రాచీనమైన పుస్తకాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఎంతో ఆహ్లాదకరంగా తిలకించారు. కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ మజ్జి శశిభూషణరావు పుస్తకం చదవడం వలన మేధోవృద్ధిని ప్రోత్సహించడం, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించడంలో గ్రంధాలయాలు పోషించే కీలక పాత్రను గురించి వివరిస్తూ ప్రతి ఒక్కరి యొక్క ఆలోచనలు,స్ఫూర్తికి ఎంతో దోహదపడతాయని ఎటువంటి పుస్తక ప్రదర్శనల వలన విద్యార్థులు, అధ్యాపకులకు కొత్త దృక్కోణాలను అన్వేషించడానికి, వివిధరంగాలలో అభివృద్ధి చెందుతున్న పోకడలను కనుగొనడానికి మరియు అర్థవంతమైన చర్చలలో పాల్గొనడానికి చాలా ఉపయోగకరం అని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి మాట్లాడుతూ వ్యక్తులను శక్తివంతం చేయడంలో మరియు విజ్ఞాన ఆధారిత సమాజాన్ని నిర్మించడంలో గ్రంధాలయాలు కాలానుగుణ ఔచిత్యాన్ని గుర్తు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు గ్రంధాలయంలో ఎక్కువ సమయం గడపాలని పఠన అలవాట్లను పటిష్టంగా పెంపొందించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. గ్రంధాలయాధికారిణి డాక్టర్ ఎల్.సత్యవతి మాట్లాడుతూ జ్ఞానాన్ని పంచుకునే శక్తివంతమైన సంస్కృతిని పెంపొందించడంలో సంస్థ నిబద్ధతను ప్రదర్శిస్తుందని, యువ మనస్సులను రూపొందించడంలో పుస్తకాల పరివర్తన శక్తిని మరియు ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పఠనాన్ని ఏకీకృతం చేయాలని ప్రోత్సహించారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా డిజిటల్ యుగములో ప్రతి ఒక్కరు డిజిటల్ వనరులను మరియు ఇ-లైబ్రరీల వినియోగాన్ని కోరుతున్నారు .కనుక అందరికీ పుస్తక పఠనం ద్వారా జ్ఞానంను అందుబాటులో ఉంచాలని ఉద్దేశ్యంతో ఇటువంటి పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేసారని తెలియజేసారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు,గ్రంధాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

.పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యనిర్వాక ఇంజనీర్ గా టీవీ రమణమూర్తి బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-బొబ్బిలి: స్థానిక పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ముఖ్య కార్యనిర్వహక ఇంజనీరుగా టీవీ రమణ మూర్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో అమలు చేయడానికి కృషి చేస్తానని ప్రజలు ప్రజా ప్రతినిధులు సిబ్బంది సహాయ సహకారాలు అందించాలని కోరారు. చీపురుపల్లిలో డీఈ గా విధులు నిర్వర్తించి బొబ్బిలి పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యనిర్వాక ఇంజనీర్ గా బదిలీపై వచ్చారు.

జిల్లా స్థాయిలో 22న పోటీలు

విశాలాంధ్ర-భోగాపురం: భారత రాజ్యాంగ దినోత్సవం పురస్క రించుకొని మండల స్థాయిలో వ్యాసరచన, వృకృత్వం, పాటలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలో 8, 9, 10 తరగతిలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారని మండల విద్యాశాఖ అధికారి-2 మీ చంద్రమౌళి తెలిపారు. వ్యాసరచన పోటీల్లో డి.శిరీష, భోగాపురం ఉన్నత పాఠశాల, వృకృత్వం జి.వర్షిత, మోడల్ పాఠశాల, పాటలు వి.పల్లవి భోగాపురం ఉన్నత పాఠశాల, క్విజ్ పి.రమ తుడెం ఉన్నత పాఠశాలలకు చెందిన వీరు మండలంలో మొదటిస్థానం సాధించారని తెలిపారు. జిల్లా స్థాయిలో ఈనెల 22న నిర్వహిం చిన పోటీల్లో వీరు పాల్గొంటారని చంద్రమౌళి తెలిపారు.

గుంతలుపడ్డ రహదారిలో ప్రయాణం భయానకం



విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో తెర్లాం చివర్లో ఉన్న ఉద్దవోలు గ్రామానికి ప్రయాణం చేయాలంటే బిటి తారు రోడ్డు శిథిలావస్థకు కు చేరింది. ఈ రహదారి గుంతలుగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలు గుతుందని, గుంతలుపడ్డ ఈ రోడ్డుపై పగలు సమయాల్లో ప్రయాణించాలంటేనే భయ మేస్తుంది. అలాంటిది రాత్రివేళల్లో ఈ రహదారిలో ప్రయాణించాలంటూ వాహనదారులు భయపడుతున్నారు. ఉద్దవోలు నుంచి తెర్లాం మండలానికి చేరుకోవాలంటే సుమారు 20 కిలోమీటర్లు దాటి వెళ్ళవలసి వస్తుందని, మార్గమధ్యలో సుందరాడ ఎన్. భూర్జువలస, నెమలాం, పాము లవలస, చుక్కవలస, ఆర్. గదబ వలస సుమారు 10-15 గ్రామాలు ఈ రోడ్డుపై రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, రోడ్డు అంతా మలుపులు, రోడ్డు పాడైపోవడంవల్ల గ్రామాలకు చేరుకోవాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణం చేయ వలసి వస్తుంది అని ఇప్పటికైనా అధికార యంత్రాంగం ఈ రోడ్డు పై దృష్టి పెట్టాలని పరిసర ప్రాంతాల ప్రజలు కొరుకుంటున్నారు.

క్రషర్ల యాజమాన్యాల మధ్య వార్

ధరలు తగ్గించి విక్రయాలపై వివాదాలు

పిఎస్‌కె వారి క్రషర్‌కు రాకపోకలు ఆపిన ఇతర క్వారీ కాంట్రాక్టర్‌లు

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని మాధవరాయమెట్ట, పరిసరప్రాంతాలలో ఉన్న క్రషర్ యాజమాన్యాల మధ్య తీవ్ర స్థాయిలో వార్ జరుగుతోంది. గత నెలరోజులుగా గుట్టుగా సాగుతున్న ఈవివాదం కాస్తా ప్రస్తుతం బైటపడింది. వివరాల్లోకి వెళితే... మాధవరాయమెట్ట వద్ద, లక్ష్మీపురం ప్రాంతాలలో రాతి క్రషర్‌లు ఉన్నాయి. అందరూ ఒకే మాట అనుకుని పిక్క ధరలను అమ్మకాలు చేస్తుంటారు. ఏళ్ళ తరబడి ఇక్కడ ఇదే ఆనవాయితీ నడిచింది. తాజాగా జామిలోని గ్రీన్ ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్ పిఎస్‌కె స్థానికంగా తమకు అవసరమని క్రషర్ ఏర్పాటు చేసారు. దాదాపు రెండేళ్ళగా ఈక్రషర్‌నుంచి రహదారికి అవసరమైన పిక్కను తయారు చేసుకునే వారు. ప్రస్తుతం ఇక్కడ హైవే రహదారి పని పూర్తి కావడంతో క్రషర్ అవసరం లేకుండా పోయింది. అలాగే కొనుగోలు చేసిన క్వారీలు సైతం ఖాళీగా ఉండడంతో ఇతర ప్రాంతాలకు చెందిన క్వారీ వ్యాపారులకు క్రషర్‌ను, క్వారీలను లీజుకు ఇచ్చారు. కొత్తగా వచ్చిన లీజుదారులు తమ వ్యాపారం వేగంగా పెరగాలనే ఉద్దేశ్యంతో తమవద్ద కొనుగోలు చేసిన వారికి తక్కువ ధరకు పిక్కను అమ్మకాలు చేసారు. దీంతో ఇతర క్రషర్ యాజమాన్యాలు వీరిపై భగ్గుమన్నాయి. క్రషర్‌కు తగిన ఆర్డర్లు రాకపోవడంతో క్వారీలు కూడా తీవ్రంగా నష్టపోయాయి. దీంతో క్వారీ యజమానులు లీజుదారులతో చర్చలు జరిపారు. తాను నష్టపోతున్నామని, కనీసం తమవద్ద లభించే క్రషర్‌కు అవసరమైన క్వారీ రాయిని తీసుకోవాలని లీజుదారులపై వత్తిడిపెంచారు. కానీ మావద్ద క్వారీలు ఉన్నాయని మాకువద్దని లీజుదారులు ఖరాఖండీగా చెప్పడంతో చివరకు క్వారీ యజమానులు లీజుదారుల క్రషర్‌నుంచి వాహనాలు రాకపోకలు జరగకుండా రాళ్ళగుట్టలను అడ్డుగా వేసారు. ప్రస్తుతం జరుగుతున్న వివాదం పరిష్కారదిశగా వెళ్తుందోలేక తీవ్రమవుతుందో చూడాలి.

26న శంఖారావం, ర్యాలీ జయప్రదం చేయండి

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై

వామపక్షాలు, ప్రజాసంఘాల ఐక్యవేదిక



విశాలాంధ్ర-బొబ్బిలి : కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలపై ఈనెల 26న శంఖారావం నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల .శ్రీనివాసరావు, పిసిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు, పట్టణ కళాసీ సంఘం నాయకులు వై. అప్పారావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు లు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం శంఖారావం ప్రచార పత్రాలను వారు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులపై భారాలు వేస్తూ పాలన చేస్తుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, ఎరువుల ధరలు పెంచి ప్రజలు, రైతులు నడ్డి విరుస్తున్న మోడీ గత పదేళ్లలో కార్పొరేట్ సంస్థలకు రూ.19.28లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని విమర్శించారు. కార్మికుల హక్కులపై దాడి చేసేందుకు లేబర్ కోడ్ చట్టాలను తీసుకు వచ్చారని, వ్యవసా య రంగాన్ని కార్పొరేట్ సంస్థ లకు అప్పగిం చేందుకు వ్యవ సాయ నల్ల చట్టాల ను తెచ్చారన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతన్నలు పోరాటం చేస్తే రద్దు చేసి రైతులు పండించే పంటలకు గిటుబాటు ధరలు కల్పిస్తామని హామీ ఇచ్చిన మోడీ అమలు చేయడం లేదన్నారు. కార్మిక చట్టాలను అమలు చేసి లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న బొబ్బిలి ఎన్టీఆర్ విగ్రహం జంక్షన్ నుంచి బజారు, మేధరబంద, చర్చి సెంటర్, శ్రీవేణుగోపాల స్వామి ఆలయం జంక్షన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి నిరసన తెలుపుతామని చెప్పారు. నిరసన ర్యాలీను జయప్రదం చేయాలని కోరారు.

విలువలతో కూడిన విద్య అవసరం

మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : సమాజంలో ఉన్నతంగా ఎదిగేందుకు విలువలతో కూడిన విద్య అవసరమని, జీవితంలో విజేతలు గా నిలవాలంటే విలువలు అవసరమని మాజీ కేంద్ర మంత్రి పి. అశోకగజపతిరాజు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో "గ్రంథాలయ ఆవశ్యకత " అను అంశంపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటిల్లో విజేత లుగా నిలిచిన వారికీ గురువారం ప్రశంసాపత్రాలు, బహుమ తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానానికి వెళ్లేం దుకు, ఉత్తమ వ్యక్తు లుగా తీర్చి దిద్ద బడేం దుకు విద్యార్థి దశ చాలా కీలకమని అన్నారు. విద్య తో బాటు ప్రతీ ఒక్క రికి క్రమశిక్షణ, సమయపాలన అవసరమని, నిరంతర సాధన ద్వారానే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరని సూచించారు. ఈ సందర్భంగా విజేతలందరిని అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎర్నాయుడు, ఉపాధ్యక్షులు కె. దయానంద్, గౌరవ అధ్యక్షులు నాలుగెస్సులరాజు, మోనంగి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టెలివిజన్ దినోత్సవం

విశాలాంధ్ర-భోగాపురం: మిరాకిల్ విద్యా సంస్థలలో గురువారం ప్రపంచ టెలివిజన్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టెలివిజన్ యొక్క సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక ప్రభావాన్ని, ప్రజల జీవితాల్లో ఆవిష్కరించిన మార్పులపై అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా డాక్టర్ ఎస్.ఏ. హుస్సైన్ మాట్లాడుతూ టెలివిజన్ యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు. వారు టెలివిజన్ ద్వారా విద్య, వినోదం మరియు సమాచార రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులను ప్రస్తావించారు. ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. అర్జున రావు మాట్లాడుతూ, "టెలివిజన్ ప్రజల మధ్య మానవతా విలువలు మరియు ప్రపంచ స్థాయిలో అవగాహన పెంపొందించే వేదికగా మారింది. టెలివిజన్ రంగంలో నూతన సాంకేతికతలు విద్యార్థులకు మరింత పరి శోధన చేయ టానికి ప్రేరణ నిస్తాయి" అని తెలిపారు. విద్యా ర్థులు టెలివిజన్ అభివృద్ధి చరిత్ర, దీని భవిష్యత్ సాంకేతికతలపై ప్రాజెక్ట్ ప్రదర్శనలు మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కడకండ, చినదుంగాడ, పాఠశాల సందర్శన

ఎంఈఓ బాల భాస్కరరావు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని కడకండ,చిన దుంగాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి పి. బాల భాస్కరరావు గురువారం సంద ర్శించారు. ఈ సందర్భంగా పాఠ శాల పరిసరాలు, తరగతి గదులు,కిచెన్ గార్డెన్ పరిశీలించిన అంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్ చదివించడం రాయించడం, అంకెలు, సంఖ్యలు, చతుర్విద ప్రక్రియలు చేయించడం, వర్క్ బుక్స్, పరిశీలించారు. అలాగే శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం మొదలగునవి పరిశీలించిన సంతృప్తం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆర్ చల్లం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ కు తరలింపు

ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : విజయనగరం నగరపాలక సంస్థలో గత కొన్ని రోజులుగా వివిధ ప్లాస్టిక్ షాపులపై దాడులు నిర్వహించి, స్వాధీనం చేసుకున్న నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ కు గురువారం తరలించారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్న 1100 కేజీల నిషేధిత ప్లాస్టిక్ సామాగ్రిని విశాఖపట్నంలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ కు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు పూర్తిగా నిషేధించామని మరోసారి స్పష్టం చేశారు. ఇకపై ఏ ఒక్కరూ ప్లాస్టిక్ సామగ్రిని విక్రయించరాదని తెలిపారు. అలాగే ప్రజలు కూడా క్యారీ బ్యాగులు వంటివి వాడకుండా గుడ్డ సంచులు వినియోగించుకోవడం మంచిదని సూచించారు.

అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణ మండల పరిధిలో బెల్ట్ షాపుల ద్వారా అక్రమ మద్యం అమ్మకాలు చేస్తున్న ఐదుగురు వ్యక్తులను గురు వారం తహాశీల్దార్ మరియు మండల మెజిస్ట్రేట్ కోర్టు ఎం. శ్రీను వద్ద ఎక్సైజ్ శాఖ సీఐ పామోటి చిన్నమ నాయుడు 129 బి ఎం ఎస్ ఎస్ సెక్షన్ కింద బైండ్ ఓవర్ చేశారు. అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ సిఐ తో పాటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

కొండ్రాజుపాలెం గ్రామ సందర్శన

విశాలాంధ్ర -భోగాపురం: మండల కొండ్రాజుపాలెం గ్రామ పంచాయతీలో నోడల్ అధికారి సుధారాణి ఆధ్వర్యం లో గ్రామ సందర్శన కార్యక్ర మం నిర్వహిం చడమైంది. గ్రామంలో వ్యక్తిగత మరుగు దొడ్ల వినియోగంపై ఆరా తీసారు.వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుధ్యం మెరుగుపరచి ప్రజలు వ్యాదులు భారిన పడకుండా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సిబ్బంది పనితీరు లో మార్పు రావాలి

కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : ప్రజారోగ్య సిబ్బంది పనితీరు లో మార్పు రావాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజారోగ్య పర్యవేక్షకులు, మేస్త్రీలు, శానిటరీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డ్ లుగా తయారవుతున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేసి శుభ్రపరచాలని చెప్పారు. ఖాళీ స్థలాల యొక్క యజమానులతోనే పరిశుభ్రత కార్యక్రమాలు చేయించాలని తెలిపారు. కాలువలపై పలకలు వేసి మురుగును కూడా తీయడానికి వీలు లేకుండా కొందరు తయారు చేస్తున్నారని వాటి పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సెంట్రింగ్ గ్రిల్స్ పై బట్టలు ఆరబెట్టడం చోద్యంగా ఉందని అన్నారు. పారిశుధ్య పనివారలు తప్పనిసరిగా ఆప్రాన్లు ధరించి విధులు నిర్వర్తించాలన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ శతశాతం జరగాలన్నారు. ఎక్కడా ఆక్రమణలకు తావు లేకుండా చూడాలన్నారు.

తెర్లాంలో శరవేగంగా నిర్మాణం జరుగుతున్న గోశాలలు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో తెర్లంలో ప్రభుత్వం మంజూరు చేసిన గోశాలలో శరవేగంగా లబ్ధిదారులు నిర్మాణం చేపడుతున్నారని ఏపీవో కే సుశీల తెలిపారు. గురువారం గోశాలలను పనులు పరిశీలన చేసిన ఏపీవో సందర్భంగా మాట్లాడుతూ గోశాలలో రైతులకు ఎంతో ఉపయోగమని వాటిని రైతులందరూ వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. మండలానికి ఇప్పటివరకు 59 గోశాలల మంజూరయ్యాయని అందులో 51 గోసాలలు, 5 మేకల షెడ్లు, మూడు పౌల్ట్రీ మంజూరయ్యాయని ఆమె తెలిపారు. ఈమెతో టెక్నికల్ అసిస్టెంట్ త్రినాధ్ నాయుడు, క్షేత్ర సహాయకులు శంకర్రావు పాల్గొన్నారు.

పాడి రైతులను విశాఖ డెయిరీ ఆదుకోవాలి

రైతు సంఘం రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ

విశాలాంధ్ర-రామభద్రపురం: పాడి రైతులను విశాఖ డైరీ అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం సూర్యనారాయణ గురువారం రాజం రోడ్ లో ఉన్న విశాఖ డైరీ వద్ద పాడి రైతులతో ధర్నా ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏడు జిల్లాలలో విశాఖ డైరీ విస్తరించి ఉందని అన్నారు. మూడున్నర లక్షల మంది పాలు పోసి సభ్యులుగా ఉన్నారని అన్నారు. ఈమధ్య డెయిరీ యాజమాన్యం పాల ధర తగ్గించడం చాలా దారుణమని అన్నారు. ఇతర డేరిలికి విశాఖ డైరీ కి ధరలు చాలా తేడా ఉందని అన్నారు. ఆవు పాలు ధర 50 రూపాయలు, గేదె పాల ధర 80 రూపాయలు రైతులకు ఇస్తే ఈ గిట్టుబాటు అవుతుందని అన్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రైతుకు 75% బోనస్ రూపంలో ఇచ్చి ఆదుకోవాలని కోరారు. గడ్డి, దాన, కృత్రిమ గర్భధారణ వాటికి ఖర్చులు ఎక్కువయ్యాయని రైతులు భరించలేక నష్టాలలో కూరకు పోయారని అన్నారు. డెయిరీ రైతులు కష్టాలను గుర్తించి ధరను పెంచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు రాంబాబు స్థానిక నాయకులు బలస శ్రీను రైతులు పాల్గొన్నారు.

వార్డు పర్యటన లో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమల రావు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: విజయనగరం పరిధిలోని 15వ డివిజన్లో నిర్వహించిన వార్డు పర్యటనలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమల రావు పాల్గొన్నారు. చిన్న పల్లి వీధి, పెద్దపల్లి వీధి, తెలకల వీధి, రామ మందిరం తదితర ప్రాంతాల్లో జరిగింది. అక్కడక్కడ చిన్నచిన్న సమస్యల మాత్రమే ప్రజలు వినతి రూపంలో అందించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ తిరుమలరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కమిషనర్ సూచనలతో ప్రతి గురువారం వార్డు పర్యటన చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా గురువారం 15వ డివిజన్లో పర్యటించామన్నారు. అయితే నాలుగుచోట్ల వీధి దీపాలు మరమ్మ తులకు గురయ్యాయని, రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరారని చెప్పారు. సమస్యలను ఉన్నతాధి కారుల దృష్టిలో ఉంచి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అల్లు చాణక్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అవగాహన-జీవన నైపుణ్యాలపై శిక్షణ

జేవివి జిల్లా అధ్యక్షుడు ఆనంద్

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో విద్యార్థులకు సామాజిక అవగాహన-జీవన నైపుణ్యాలు అన్న అంశంపై ఒక్కరోజు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్,రాష్ట్ర నాయకులు డాక్టర్ పైల రమేష్ రాజు తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఉత్తమ పౌర సమాజం స్థాపన,అందవిశ్వాసాలకు వ్యతిరేకంగా మూడున్నర దశాబ్దల క్రితం ఆవిర్భవించిన జనవిజ్ఞాన వేదిక విద్య,వైద్యం,వ్యవసాయ రంగం,శాస్త్రీయ దృక్పథం వంటి ఎన్నో అంశాలపై అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.ఇందులో భాగంగా ఈనెల 23 వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు వందలాది మంది విద్యార్థులకు సామాజిక అవగాహన-జీవన నైపుణ్యం అన్న అంశాలపై ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగ పోటీల కు సిద్ధపడే వారికి, డిగ్రీ,ఇంజనీరింగ్ విద్యా ర్థులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా అదనపు జడ్జి కే.నాగమణి, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని స్పష్టం చేశారు.అనంతరం శిక్షణ తరగతుల ఆహ్వానం పత్రికలను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నగర అధ్యక్షుడు షిణగం శివాజీ, ప్రధాన కార్యదర్శి పి.షణ్ముఖరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సనపతి ఈశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు గౌరవం ఇవ్వాల్సిందే...

కూటమిలో 80 శాతం టిడిపి నాయకులే
కూటమి ధర్మానికి తలవంచి ఎంఎల్ఏ నీ గెలిపించాం
అవమానిస్తే చూస్తూ ఊరుకోం ధర్నాకు దిగుతాం
మాజీ మండలాధ్యక్షుడు మహంతి చిన్నం నాయుడు

విశాలాంధ్ర-పూసపాటి రేగ: మండలంలో 40 సంవత్సరాలుగా టిడిపి కంచుకోటగా పేరుపొంది ఏడుసార్లు ఎమ్మెల్యేగా నారాయణస్వామి నాయుడు 5 సార్లు ఏకదాటి ఎంపీపీగా గెలిచిన ఘన చరిత్ర ఉన్న మండలంలో నేడు టిడిపి పార్టీ జెండా మోసిన కార్యకర్త అవమానిం పబడుతున్నాడని టిడిపి మాజీ మండల అధ్యక్షుడు మహంతి చిన్నమనాయుడు మండల అధికారులపై తనదైన శైలిలో విరుచుకు పడ్డారు. గురువారం మండల కార్యాలయంలో టిడిపి కార్యకర్తలు అధికారులను సమావేశపరిచి ఆయన మాట్లాడాతూ గత ఎన్నికల్లో కూట మి ధర్మానికి కట్టుబడి 80% ఓటు బ్యాంకు ఉండి జనసేన ఎమ్మెల్యేని గెలిపించాం. గెలిచిన నాటి నుండి టిడిపి నాయకులను కార్యకర్తలను అవమానాలకు గురిచేస్తున్నారని కూటమి ప్రభుత్వం ఉన్నప్పటికీ కూటమి ధర్మాన్ని ఎమ్మెల్యే పాటించట్లేదని నియోజక వర్గంలో అధికారులకు ఎవరు వస్తే పనిచేయాలో పేర్లు పంపించడం 40 సంవత్సరాలుగా రాజకీయం చేస్తున్న సీనియర్లు అని చూడకుండా అధికారులు ప్రతి పనికి ఎమ్మెల్యే చెప్పాలనడం అసంబద్ధమని, అవమానకరమని ఆయన వాపోయారు. గ్రామాలలో జరుగుతున్న పనుల విషయంలో గాని మరి ఏ ఇతర కార్యక్రమాలకు టిడిపి నాయకులను అధికారులు పిలవడం లేదని. అధికార కూటమిలో తాముంటే ప్రతిపక్షమైన వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తలకు పనులు అప్పగిస్తున్నారని ఆయా గ్రామాల్లో ఉన్న టిడిపి నాయకులను అన్యాయం చేస్తున్నారని ఆయన అన్నారు. ఇకనుండి ప్రతి అధికారి సమన్వయంతో మెలిగి ప్రతి టిడిపి కార్యకర్తలు గౌరవించాలని ఆయన అధికారులు కోరారు. అలా కాని పక్షంలో కార్యాలయం ముందుట అందరూ ధర్నాకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహంతి చిన్నం నాయుడు తో పాటు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మా ఇంటి శంకర్రావు, మాజీ జడ్పిటిసి ఆకిరి ప్రసాదరావు, తెలుగుదేశం మండల నాయకులు , మండల అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీ సర్వే, హౌస్ టాక్స్ వేగవంతంగా చేయాలి

డిపిఓ వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-తెర్లాం: జిల్లాలో స్వర్ణ పంచాయతీ సర్వే, హౌస్‌టాక్స్ వేగ వంతంగా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి టి వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంతవరకు జిల్లాలో 19 కోట్ల ఆరు లక్షల 7000 రూపాయలు ఇల్లు పనులు బకాయిలు ఉన్నాయని వాటిని వేగవంతంగా వసూలు చేయాలని ఆయన తెలిపారు. అలాగే స్వర్ణ పంచాయితీల సర్వే వేగవంతంగా చేయాలని తెలిపారు. తెర్లా మండలంలో ఇంతవరకు 41లక్షల 43 వేల 528 రూపాయలు హౌస్ టాక్స్ వసూల్ చేయవలసి ఉందని ఆయన తెలిపారు. ఈయనతో ఎంపీడీవో ఆర్ రాంబాబు, ఈవోపీఆర్డి నీలిమ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

25 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యం



విశాలాంధ్ర- రామభద్ర పురం : ఈ సంవత్సరం ఉపాధి హామీ కూలీలకు 25 లక్షల పనిదినాలు కల్పించడమే తమ ఉద్దేశ మని ఆ పథకం రాష్ట్ర డైరెక్టర్ వైవికె షణ్ముఖకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని దు ప్పలపూడి, తారాపురం, కొట్టక్కి, కాకర్లవలస గ్రామాలలో జిల్లా ద్వమాపీడీ కళ్యాణ్ చక్రవర్తితో కలసి ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను పరిశీలించారు కట్టకి గ్రామంలో ఒక రైతు. రెండు ఎకరాలలో కొబ్బరి మొక్కలు పెంపకం చాలా అద్భుతంగా పెంచుతున్నారని కొనియాడారు. కాకర్లవలసలో ఫారం ఫాండ్స్ బాగున్నాయన్నారు. తారాపురం గ్రామంలో మంచినీరు కోనేరు చుట్టూ కొబ్బరి మొక్కలు పెంచితే ఆ గ్రామానికి భవిష్యత్తులో ఆదాయం వస్తుందని వాటి ద్వారా గ్రామాల అభివృద్ధి పరుస్తారన్నారు. అలాగే ఉపాధి కూలీలకు ఎప్పటికప్పుడు ప్రభుత్వము వేతనాలు పెండింగ్ లేకుండా వారి ఖాతాలలో జమ చేస్తుందని అన్నారు. ఒక్కొక్క వేతన దారుడికి 250 వేతనం లభిస్తుందని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం లక్ష్యం వలసలు నివారించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం, ఏపీ వత్రినాథ, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత సర్వే...

విశాలాంధ్ర-వంగర: నైపుణ్య గణన సర్వే పై శిక్షణా తరగతులను నిర్వహించారు. బుధవారం వంగర మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులచేపట్టారు. స్కిల్ సెన్సెస్ హెల్త్ సర్వేలో నిరుద్యోగ యువతీ, యువకుల నైపుణ్యాలను గుర్తించాలని టీఓటీ ఆశపు వైకుంఠరావు, ఎంపిడిఓ త్రినాథరావు, ఈఓపీఆర్ డీ కెల్ల రామారావు, కొండ చాకరా పల్లి వెల్ ఫేర్ అసిస్టెంట్ బి.ప్రసాద్ రావు తదితరులు శిక్షణ నిచ్చారు.ఈ స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ముఖ్య ఉద్దేశం నిరుద్యోగ యువతీ యువకులకు 15 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు మధ్య వయసు ఉన్న వారికి గ్రామాల్లో సర్వే చేయాలని, వారి యొక్క చదువు మరియు ఐటిఐ ఇంజనీరింగ్ పాలిటెక్నికల్ మరియు ఇతర టెక్నికల్ నాన్ టెక్నికల్ లో ఎటువంటి అనుభవం ఉన్నది తదితర అంశాలను సర్వే లో నమోదు చేయాలన్నారు. యువతీ,యువకులకు ఎటువంటి శిక్షణ కావాలి మొదలుగా అన్ని వివరాలతో సర్వే చేయడం జరుగుతుంది. ఇందులో సుమారు 80 ప్రశ్నలు వరకు సిటిజన్ నుంచి సేకరించి సర్వే చేయవలసి ఉంటుంది. ప్రతీ గ్రామంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు సరైన శిక్షను ఇచ్చి వారికి అభిరుచి గల రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ముఖ్య ఉద్దేశం గా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ,వెల్ఫేర్ అసిస్టెంట్ లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలు గా మారుస్తూ జీవో ఇవ్వాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మినీ అంగన్వాడీ లను మెయిన్ అంగన్వాడీలు గా మారుస్తూ జీవో వెంటనే ఇవ్వాలని కోరుతూ గురు వారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ధర్నా వద్దకు విచ్చేసిన ఏపీ డి విజయ కుమారి మినీ వర్కర్ ను ఉద్దేశించి మాట్లాడుతూ డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం తీసుకొని మీ సమస్యలను విడి, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే డిఆర్ఓ సిఎస్ శ్రీనివాస మూర్తి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సుబ్బ రావమ్మ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి బి పైడ్రాజు, ఎస్.అనసూయ, జిల్లా గౌరవ అధ్యక్షులు వి లక్ష్మి, మినీ వర్కర్ల నాయకులు డి వెంకటలక్ష్మి, అంగన్వాడి జిల్లా కమిటీ సభ్యులు పి జ్యోతి, కృష్ణవేణి, శ్యామల, మాలతి, ఉమా, సరళ, సుభాషిణి, కుమారి, రమణమ్మ, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

టీవీ టెక్నీషియన్స్‌ను అసంఘటిత కార్మికుల కింద చేర్చాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రపంచ టెలివిజన్ డే సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో స్టేట్ యూనియన్ ఆధ్వ ర్యంలో టెలివిజన్ డే వేడుకలను నిర్వహించారు. జిల్లా టీవీ మెకా నిక్స్ యూనియన్ ఆఫీస్ వద్ద, యూనియన్ అధ్యక్షులు రౌతు శ్రీని వాసరావు గౌరవ అధ్యక్షులు గోపాల్, యూనియన్ బాడీ మెంబర్స్, సభ్యులు సమక్షంలో ప్రపంచ టెలివిజన్ దినోత్సవ వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం టీవీ టెక్నీషియన్స్ కూడా గుర్తించి లేబర్ యాక్ట్ లో అసంఘటిత కార్మికుల కింద చేర్చాలని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వృత్తుల వారికి ఏ విధమైన సహాయ సహకారాలు అందిస్తున్నారో మా టీవీ టెక్నీషియన్స్ వృత్తి వారికి కూడా ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయ నగరం అర్బన్: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం నగరంలో వివిధ ప్రాంతాలలో పర్య టించిన విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పలు అంశాలను పరిశీలించి సిబ్బందికి తకు సూచనలు చేశారు. కోట ప్రాంతంలో బొంకుల దెబ్బ మీద విక్రయాలు సాగిస్తున్న కూరగాయల వర్తకులకు తగు సూచనలు చేశారు. చెత్తాచెదారాలను ప్రధాన రహదారిపై వేయకుండా డస్ట్ బిన్లు ఉపయోగించాలని చెప్పారు. ఆ తర్వాత గుమ్చీ ప్రాంతంలో పర్య టించి అక్కడ కాలువ అపరిశుభ్రం గా ఉండడాన్ని గమనించారు. తక్షణమే కాలువలో ఉన్న చెత్తాచెదారాలను ప్రక్షాళన చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఆ తర్వాత రింగ్ రోడ్ లో పర్యటిస్తూ అక్కడక్కడ ఉన్న టిఫిన్ దుకాణాలు వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వినియోగాన్ని సాగిస్తున్నది లేనిది గమనించారు. ఓ టిఫిన్ దుకాణంలో ప్లాస్టిక్ సంచులు వినియోగించడానికి గమనించి తక్షణమే అపరాద రుసుంలు విధించాలని అక్కడున్న పారిశుధ్య పర్యవేక్షుడు అంజిబాబుకు ఆదేశించారు. అనంతరం గుణ పూరుపేట లో ఉన్న డంపింగ్ యార్డ్ ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న తడి చెత్త పొడిచెత్త వర్గీకరణ విధానాన్ని గమనించారు. గుణపూరుపేట రహదారిపై చెత్తలు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అయ్యప్పస్వామి శరణు ఘోషతో ఆధ్యాత్మిక ప్రాంతంగా మారిన కొండంపేట గ్రామం



విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సి పాలిటీ పరిధి కొండంపేట గ్రామంలో వెలిసియున్న శ్రీ ధర్మశాస్త్ర హరిహర సుత అయ్యప్ప స్వామి వారి దేవాలయం సమీపంలో ఆలయ శాశ్వత ధర్మకర్త ముద్దన సత్యారావుస్వామి, శ్రీమతి శాంతి దంపతుల ఆధ్వర్యంలో గురువారం శ్రీ విజయ గణపతి అయ్యప్ప ట్రస్ట్ విశాఖపట్నం వారి పర్యవేక్షణలో కొండంపేట వాస్తవ్యులు పెళ్లూరి గౌరి కుమారుడు రామచంద్రరావు (రాము), జ్యోతి దంపతులు వారిచే మహా అంబులం, పడి పూజ, పుష్పాభిషేకం కొండంపేట అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో అంగ రంగ వైభవంగా మేల్ శాంతి బ్రహ్మశ్రీ ప్రవీణ్ కుమారన్ నంబూద్రి కేరళ వాస్తవ్యులు వైజాగ్- పెందుర్తి అయ్యప్ప ఆలయ మేల్ శాంతి గారిచే పూజా కార్యక్రమాలు నిర్వహించబడునవి. భజన కార్యక్రమంలో విజయ గణపతి అయ్యప్ప ట్రస్ట్ విశాఖపట్నం వారి పద్యవేక్షణలో గాన గాంధర్వులు తులసి భాస్కర్ బృందం వారిచే నిర్వహించ బడినది. ఈ యొక్క పూజ కార్యక్రమాలకు సుమారు పరిసర ప్రాంతాల గ్రామాల నుండి సుమారు 4,000 అయ్యప్ప, శివస్వాములకు ఆహ్వానించడం జరిగినదని నిర్వాహకులు ముద్దన సత్యారావు తెలిపారు. ఇంత భారీగా ఈ పరిసర ప్రాంతాలలో అయ్యప్ప స్వామి పూజలు చేయడం కొండంపేట పరిసర ప్రాంతమంతా అయ్యప్ప శరణ గోసతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.